కథ

# 'ఐ' 'ఇ'

**రోహిణి చింతా**

**సీత క్లాసులో అందరికంటే బాగా చదివేది. ఏక సంధాగ్రాహి. ఒక్క లెఖ్ఖల్లో తప్ప అన్నింట్లోనూ తనే ఫస్టు. లెఖ్ఖల్లో మాత్రం సూరమ్మగారి పెద్ద శీను ఫస్టు వచ్చేవాడు... వాళ్ళ నాన్న లెఖ్ఖల మాష్టారు కదా... అందుకనీ! ఈ విషయమే కళావతితో చెప్తే, అంది "అయితే మరి మీ నాన్న హెడ్‌మాష్టారు కదా... అందుకు నీకు మిగతా అన్ని సబ్జెక్టుల్లోనూ ఫస్టు వస్తుందా?" అని అడిగింది కుళ్ళుమోతు. దానికసలు చదువే సరిగ్గా రాదు. మొన్న డిక్టేషను టెస్టులో 'ఐరావతము' అని రాయమంటే 'అయిరావతము' అని రాసింది. దాంతో మాష్టారు దాన్ని బాగా కొట్టారు. దాన్ని కొట్టారని కాదు దాని బాధ... సీతని మెచ్చుకున్నారనీ!**

**సీత అన్నీ కరెక్టుగా రాసింది కదా...! అందుకనీ దానికి కోపం వచ్చి, ఆ రోజంతా అది సీతతో మాట్లాడలేదు తెలుసా...!**

సీతకీ 'ఐరావతము' అని రాయడం వాళ్ళ కృష్ణ అన్నయ్య నేర్పించాడు. సీతకి మొదట్లో 'ఐ' కీ 'ఇ'కి తేడా తెలిసేది కాదు. రెండింటినీ ఒక అయిదుసార్లు రాశాక సీతకి ఒక విషయం తెలిసింది. ఎడం పక్క నుంచి మొదలుపెట్టి జిలేబీ చుట్టల్లాంటివి చుడితే అది 'ఐ' అనీ, అదే కుడిపక్కనుంచి చుడితే అది 'ఇ' అనీనూ దాంతో సీత అటునుంచో, ఇటునుంచో మొదలుపెట్టి రోజంతా అటో, ఇటో ఏక చుట్టలు చుట్టేది - 'ఇ' ఇలాగో లేదా 'ఐ'-ఇలాగో. కాని రెండు రోజులు వరుసపెట్టి చుట్టినా, తన నోటు పుస్తకంలో వాఖ్యం మాత్రం ఇలాగే ఉంది:

'కుంతీదేవి ఐ రావతమును స్వర్గమునుంచి తెప్పించుటకు భీముణ్ణి పంపించెను.

దాంతో సీత 'ఐ'లూ 'ఇ'లూ రాయటం అసలు మానేసింది. తన పేరు ఎవరైనా రాయమంటే 'రవి దుర్గా సీత భవా-' అని రాసేది. మొన్న గుడ్డి రాజువాళ్ళ అక్కకి ఉత్తరం రాసి పెట్టమంటే, ఏం రాయాలో విషయం కనుక్కుని...

'మహాలక్ష్మి సమానురాలైన మ-కి,

శారద పెళ్ళికి మనకున్న రెండెకరాల మాగా-అమ్మదాం అనుకుంటున్నాను. బావగారిక్కావాలా... వేరెవరికైనా అమ్మెయ్యనా? ఇంతే. కావాలంటే తొందరగా చెప్పు.

అన్నట్టు నేను గుడ్డివా- కదా! పాపం పెద్దమ్మాయిగారి సీత ఉత్తరం రాసిపెట్టింది. బంగారు తల్లి! నువ్వొచ్చేటప్పుడు తనకి జీళ్ళూ, తాండ్ర, చక్కెర బా-లు తెచ్చిపెట్టు... ఏం? మర్చిపోకు. ఇవి చాలా ముఖ్యం.

ఇట్లు
గుడ్డిరాజు, సీత.

అని రాసిపెట్టింది.

ఓ నెల తరువాత శారద పెళ్ళికొచ్చిన గుడ్డిరాజు అక్కగారు, ఉత్తరం మర్యాద లేకుండా ఉందని గుడ్డిరాజును తిట్టి, సీతకి జీళ్ళిస్తూ "చక్కరబా ఏమిటే తల్లీ?" అని అడిగింది. సీత ఆవిడతో విషయం చెప్పింది. ఆవిడ ఓ పేద్ద పెత్తనాల పేరమ్మ కదా... దాంతో సీతకి 'ఇ' రాయడం రాదన్న సంగతీ ఊళ్ళో అందరికీ తెలిసిపోయింది. బళ్ళో పిల్లలందరూ సీతని 'భవాణి. భవాణ' అని అల్లరిపెట్టారు. ఆఖరకి కళావతి కూడా మిగిలిన పిల్లలతో కలిసి సీతని బాగా ఏడిపించింది. సీత కనిపించినప్పుడల్లా పలక తీసి 'ఇ' 'ఐ' రాసి కనుబొమ్మలు ఎగరేస్తూ ఉండేది. దాంతో సీతకీ తలకొట్టేసినట్టయిపోయింది. పాపం బళ్ళోకి వెళ్ళడం కూడా మానేసింది. రోజూ తలనెప్పనో, కాళ్ళు నొప్పనో ఏదో ఒక వంకపెట్టి ఇంట్లోనే ఉండిపోయేది. పైగా ఇంట్లో ఉండడమే కాక, వాళ్ళమ్మని అది చెయ్యి, ఇది చెయ్యి అని విసిగించేది. ఓ రోజు గుమ్మడి కాయమామ్మని 'అరిశలు' చేసి పెట్టమంటే, గుమ్మడికాయ మామ్మ 'నేనేవన్నా నీ అత్తగార్నా... వెళ్ళవతలకి" అంది. "అత్తగారయితే చేస్తుందా?" అని సీత ఎంతో అమాయకంగా అడిగింది. 'ఆ... చేస్తుంది. శ్యామలత్తగారి లాంటిదయితే అరిశలూ పెడుతుంది, ఆరళ్ళూ పెడుతుంది" అంది.

ఆ మాట వింటూనే సీతకి ఒక అద్భుతమైన ఆలోచనవచ్చింది. తనకి ఎలాగా ఇంట్లో కూచుని, కూచుని బోరుకొడుతోంది. పోనీ బళ్ళో కెళ్దామంటే మళ్ళీ 'ఐ' 'ఇ'ల గొడవ. ఎందుకొచ్చిన బాధలూ, ఎప్పటికైనా ఎలాగా పెళ్ళిచేసుకోవాలి కదా... అదేదో ఎంచక్కా ఇప్పుడే చేసేసుకుంటే బావుండని అనుకుంది. పెళ్ళంటే బళ్ళో మాష్టారు కర్రతో చేస్తారూ... అది కాదు! రెండో రకం పెళ్ళి. మొన్న శ్యామలక్కకి చేశారూ. అలాంటిది. అప్పుడు అమ్మ ఎంచక్కా ఏ పనీ చెప్పకుండా, అవి తినూ, ఇవి తినూ అని రకరకాల పిండి వంటలు తను అడగకుండానే పెడుతుంది. కొత్త బట్టలూ, బోల్డు పట్టు పరికిణీలు, వెండి కంచాలూ... అన్నీ ఇస్తారు. మళ్ళీ రోజుకోరకం పూలజడ వేసి అందంగా తయారు చేస్తారు. శ్యామలక్కకయితే వాళ్ళమ్మ బంగారు జడగంటలు చెయ్యించింది తెలుసా? కానీ సీతకీ అంత జడలేదు కదా... అంచేత జడగంటలు వద్దు. మరేమో... తనకేమో... ఎంతో ఇష్టమైన

బంగారు గాజులు అడుగుతుంది. అవీ... కొత్త బట్టలూ వేసుకునీ, తనకి తినాలనిపించినవన్నీ తినేసి, పల్లకీలో ఊరేగేశాక ఇంక పెళ్ళొద్దని చెప్పేస్తే సరి!

అప్పటికి ఆపేసి, మళ్ళీ తనకి కావలసినప్పుడు కొత్త పెళ్ళి చేసుకోవచ్చు. మళ్ళీ ఊరేగొచ్చు. ఈసారి కారులో ఊరేగితే దర్జాగా బోల్డు బావుంటుంది. మళ్ళీసారేమో గుర్రబ్బండిలోనూ.. అలా తనకి బోరు కొట్టినప్పుడల్లా కొత్త కొత్తగా ఊరేగే పెళ్ళిళ్ళు చేసుకోవచ్చు. హాయిగా బళ్ళోకి వెళ్ళఖర్లా.

మర్నాడు అమ్మ పూజ చేసుకుంటుంటే. సీత పక్కనే కూర్చుని "అమ్మా! నాకు పెళ్ళి చెయ్యవా" అనడిగింది. అమ్మపట్టించుకోకపోతే, పోరడం మొదలు పెట్టింది. "అసలు నీకు ఈ వెధవ ఆలోచన ఎవరిచ్చారురా?" అని అమ్మ తిట్టింది. "అమ్మా! నాకు బోరు కొడుతోంది. పెళ్ళిచేస్తావా... లేదా?" అంది సీత. "సరే... సాయంత్రం నాన్నతో చెప్పి చేయిస్తాలే" అంది అమ్మ. "అమ్మా! మాష్టారు పెళ్ళికాదు. శ్యామలక్క లాంటి పెళ్ళి" అని సీత ఆనందంగా వీధిలోకి పరిగెత్తింది.

రెండురోజుల తరువాత సీతా వాళ్ళింటికీ వాళ్ళ కాముడు మామయ్య, ఆయన కొడుకూ వచ్చారు. ఆ అబ్బాయి పేరు రామశాస్త్రి. ఒకటే జిడ్డుమొహం, బొగ్గునలుపూనూ. సీతకస్సలనచ్చలా. వాడితో ఆడుకోవే అని నాన్న ఎన్నిసార్లు చెప్పినా, ఒక మాటయినా మాట్లాడకుండా చివరి గదిలో తలుపేసుక్కూచుంది. రోజూ వాళ్ళు వెళ్ళిపోతే బావుణ్ణని సీతనుకోనూ... వాళ్ళుండిపోనూ... ఆఖరికీ వాళ్ళనే "మీరు మీ ఇంటికి ఎప్పుడు వెళ్ళిపోతారురా?" అని అడిగేసింది. సమాధానం రాలేదు కానీ, నాన్న నుంచి చివాట్లు బాగా పడ్డాయి.

రోజూ సీత చేత ఆ రామశాస్త్రికి కాఫీలూ, మజ్జిగలూ పంపించేవాడు నాన్న. గొప్ప మర్యాదస్తుడు కదా...! ఇవ్వనంటే నాన్న కొడతాడేమో అన్న భయంతో ఇచ్చేది. ఇలా ఉండగా, పదిహేను రోజులయ్యాక సీత వాళ్ళ మూడో అన్నయ్య కృష్ణ కూడా వచ్చాడు. ఓ రోజు రాత్రి పడుకునే ముందు సీతావాళ్ళమ్మ వాళ్ళందరికీ మజ్జిగ ఇచ్చి రమ్మనీ పంపించింది. సీత వెళ్ళేసరికి కాముడు మామయ్య "పట్టాభీ! మా రాముడికీ మీ సీతనిచ్చి పెళ్ళి చేస్తే ఎలా ఉంటుందీ" అని అడుగుతున్నాడు. అంతే! సీత ఇంకేమీ వినకుండా లోపలికి పరిగెట్టి అమ్మని పట్టుకుని "అమ్మా! నాకు పెళ్ళొద్దమ్మా" అని ఒకటే ఏడుపు. రాత్రంతా నిద్దరలేదు. జ్వరం వచ్చినంత పనైంది. పల్లకీ లేదూ. వెండి కంచం లేదూ.

అప్పుడన్నయ్య "మరి బళ్ళోకెళ్తావా!" అని అడిగితే "ఊ! వెళ్తా. మరి నువ్వు 'ఐ' 'ఐ'లూ నేర్పుతావా? అంది. మర్నాడు సీత గదిలోంచి బయటకే రాలేదు. అన్నయ్య ఒళ్ళో కూచుని శ్రద్ధగా 'ఐ' 'ఐ' రాయడం నేర్చేసుకుంది. సాయంకాలానికి వాళ్ళన్నయ్యకి రాసి కూడా చూపిచ్చింది. రాత్రి భోజనానికి భయపడుతూ బయటకు వచ్చిన సీతకీ రామశాస్త్రి కనిపించలేదు. "అన్నయ్యా! వాళ్ళేరీ?" అని అడిగింది. "ఎవరూ? నీ పెళ్ళివారా? "ఊ".

"రాత్రి నాన్న వాళ్ళని బాగా తిట్టి, తెల్లారుఝాము బండికి పంపించేశాడు" అన్నాడు అన్నయ్య.

సీత హమ్మయ్యా! అనుకుని గబ గబా తయారయ్యి, స్కూలుకి వెళ్ళింది. ఆ రోజే మాష్టారు డిక్టేషన్ టెస్టు పెట్టారు. 'ఐరావతము' టెస్టన్న మాట. సీతకి పరీక్షలో 10/10 వచ్చాయి. మిగిలినందరికీ 5లూ, 6లూ వచ్చాయి. మాష్టారుకీ మహాకోపం వచ్చి అందర్నీ క్లాసులోంచి బయటికి పంపించేసి మోకాళ్ళమీద కూచోమన్ని, తప్పయిన వన్నీ పదిసార్లు రాయమన్నారు. సీత ఎంచక్కా క్లాసులో దర్జాగా ఒక్కత్తే బెంచీ మీద కూర్చునీ "భవాణీ"ని చూసి నేర్చుకోండి" అని మాష్టారు అనే మాటల్ని వింటూ మురిసిపోయింది.

సమస్యల్లో ఉన్న స్త్రీల కోసం
భూమిక
హెల్ప్‌లైన్
(కేవలం ఫోన్ ద్వారానే)

సలహా, సమాచారం కోసం సంప్రదించండి
టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2908
(మీ వివరాలను గోప్యంగా వుంచడం మా బాధ్యత)
Our cause is supported by OXFAM